చెహోవ్ కథ



# బెరుకు



తొలిసారి కోర్టులో కేసు వాదించిన ప్యాట్యోర్కిన్ దిగాలుగా గుర్రబ్బండీలో కూర్చున్నాడు. చాలా చిన్న కేసు. ఓ దుకాణదారుకు డిఫెన్సు లాయరుగా వెళ్లాడు. ఇన్నాళ్ల చదువూ, యింత పరిశ్రమా వృథా. ఈ వృత్తికి యిదే చివరిరోజు. ఇక మళ్లీ కోర్టులో కాలుపెడితే తనపేరు ప్యాట్యోర్కిన్ కాదు. మనుషులింత దుర్మార్గులా? ఇంత అబద్ధాలకోర్లా? ఇంత నయవంచకులా?

అన్నింటికన్నా ముందు ముద్దాయి చేతిలోనే తను మోసపోయాడు. రక్షించమని తన కాళ్లమీద పడ్డ వాడే చెవిలో పువ్వు పెట్టాడు. క్లయింట్ మనస్తత్వాన్నీ, స్వభావాన్నీ పసిగట్ట లేకపోవడం తన మూర్ఖత్వం.

తన వాదనా పటిమ మీద, వాగ్ధాటి మీద తనకు గట్టి నమ్మకం. కాని ఎందుకో, కోర్టులో నోరు పెగల్లేదు. మాటలు తడబడ్డాయి. నత్తి. అసందర్భ ప్రసంగం. నాలికా, గొంతూ తన మాట వినవే! జడ్జీలు తనవైపు జాలిగా చూశారు. తప్పటడుగులు వేస్తున్న పసిపిల్లాడిని ప్రోత్సహించే చిరునవ్వు, కేసు వాదించలేని మూర్ఖుడు. కోర్టు సమయం వృథా చేస్తున్నట్టుగా కోపం. తృణీకారం.

అన్నింటికన్నా ముఖ్యం, ప్రాసిక్యూటరూ, తన క్లయింటూ ప్రత్యర్థీ (ప్లెయింటిఫ్) చాలా నీచంగా ప్రవర్తించారు. ఇదేనా వృత్తి మర్యాద! తనొక లాయర్నీ, కేసు వాదిస్తున్నానని కూడా గుర్తించలేదే! పైగా ఓ బఫూన్ని చూసినట్టుగా పకపకా, వికవికా నవ్వటం. తన ఆర్గ్యుమెంటుకు వాళ్ల మాటలు కలిపి ఆటాడించడం. తన వాదన బాగుంటుందని ప్రాసిక్యూటర్ మెచ్చుకోవటమా? కళ్లతో ఎద్దేవా, పెదవి మీద వెటకారం.

వెరసి ఆ ప్రవర్తనకు అర్థమేమిటి? డిఫెన్సు లాయరు చవట గాడిద అని. ఇంత అవమానాన్ని ఎలా భరించడం! హియరింగ్ ముగియగానే, ప్రాసిక్యూటర్ దగ్గరకెళ్లి చెడామడా తిట్టి, (అలా అనుకున్నాడు) కన్నీటి పర్యంతమై రెండు చేతుల్లోనూ తలపట్టుకుని కూర్చున్నాడు.

ఇంకా.... ఇలా రాస్తూ పోతే ఆరోజు మన హీరోగారి జీవితాన్ని దుర్భరం చేసిన విషయాలు మరెన్నో ఉన్నాయి.

"డిస్గస్టింగ్! ఇంక కేసులు ఒప్పుకుంటే ఒట్టు. దిసీస్ ది లాస్ట్. న్యాయవాద వృత్తి! ఆహా, ఎంత గొప్ప పేరు. పేరు గొప్ప. ఊరు దిబ్బ. అందరూ దగాకోర్లు. ఎక్కడికైనా దూరంగా వెళ్లి ప్రశాంతంగా గడపాలి."

"బండీ పరిగెత్తించరా. ఈ లెక్కన నేను యింటికి చేరేసరికి బారెడు గడ్డం పెరిగేటట్టుగా వుంది." అంటూ గుర్రబ్బండీ వాడిమీద కేక వేశాడు.

"బాగానే వుంది బాబుగారు, పరిగెత్తించనా? ఏ లోకంలో వున్నారు? వాతావరణం ఎలా వుందో కనిపించడం లేదూ! ఈ గతుకుల దారిలో ముందుకు పోగలగటమే గగనమైపోతుంటే."

నిజమే. ప్రకృతికి కూడా తనమీద కోపంగా వున్నట్టుంది. మంచు. ఈదురుగాలి. కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటి. పైగా భోరున వర్షం. నేలంతా బురద. చక్రాలెక్కడన్నా దిగబడిపోతే ఇక ఈ రాత్రి తను బతికి బయటపడతాడని నమ్మకం కూడా లేదు.

"బండీ ముందుకు కదిలేటట్టు లేదు. ఈ రాత్రికి లూకాగాడి కొంపలో గడుపుదాం." అన్నాడు గుర్రబ్బండీవాడు.

"వాడెవరు?"

"ఎవడో ఒకడు లేండి. ఈ అడవికి కాపలా వుంటాడు. అదిగో, అదే వాడిల్లు."

కుక్క మొరిగింది. దట్టమైన అడవి గుండా ఒక కాంతిరేఖ కనిపించింది. మానవజాతి మీద అసహ్యం పెంచుకున్న మన హీరోగారికి కూడా వెలుగు చూడగానే ఆశ మొలకెత్తింది.

పాత యింటి ముందర లూకా.

"పేరు మరచిపోయాను. లూకా అంటే నువ్వే కదూ! ఈ రాత్రికిక్కడ గడపనివ్వరా బాబూ. తెల్లారగానే వెళ్లిపోతాను."

"రండి బాబూ, మీరుంటానంటే నాకేం అభ్యంతరం గానీ యిప్పటికే మరో యిద్దరు పెద్దమనుషులున్నారండి."

పక్కగదిలోకి తొంగి చూడగానే ప్యాట్యోర్కిన్‌కు మానవద్వేషం తిరగ దోడింది. కొవ్వొత్తి వెలుగులో, టేబుల్ దగ్గిర యిద్దరు- ప్రాసిక్యూటరూ, ప్లెయింటిఫ్. వాళ్లూ యిలాగే అడవిలో చిక్కుబడి రాత్రిగడపడానికి వచ్చారు.

కుర్ర లాయర్ను చూడగానే వాళ్లకు ప్రాణం

**రష్యన్‌మూలం: చెహోవ్ . తెలుగు గొంతు: కరుణారుణ**

లేచి వచ్చింది. "బైట ఎలా వుందోయ్, గాలీ, వానా?"

ప్యాట్యోర్కిన్‌కు వాళ్ల మొహాలు చూడాలన్నా అసహ్యంగా వుంది. సాటి మనిషిని గౌరవించలేని సంస్కార హీనులు.

"కోర్టులో అంత జరిగిం తర్వాత మిమ్మల్ని పలకరించాలన్నా అసహ్యంగా వుంది.." అంటూ పళ్లు బిగబట్టి గొణిగాడు ప్యాట్యోర్కిన్.

వాళ్లు కుర్ర లాయర్ను ఎగాదిగా చూసి, నవ్వుకుని మళ్లీ కబుర్లలో పడ్డారు.

"ఆ ఆర్గ్యుమెంటు ఎలా వుందో తెలుసా? బిల్లుల జల్లెడలాగా. మొదటి పాయింటేమిటి... తప్పతాగిన మనిషి మూడుమైళ్లు నడిచివెళ్లి చచ్చిపోయిందట. ఏమన్నా అర్థముందా? తప్పతాగిన మనిషి మూడుమైళ్లు ఎలా నడవగలడసలు?"

వాళ్ల కబుర్లను పట్టించుకోనట్టుగా ప్యాట్యోర్కిన్ గదిని పరిశీలించాడు. అంధకారంలో కాంతికిరణం అంటే కవిత్వంలో బాగానే వుంటుందేమోగాని నిజానికి అదంత గొప్ప విషయమేం కాదు. పెచ్చులూడిన గది. పొగచూరిన గోడలూ. బలవంతంగా మండుతున్న కుంపటీ. ఒక చిన్న టేబులూ, కూర్చుంటే విరిగి పోతాయేమోననిపించే రెండు బెంచీలూ. చీకటి. చలి. ముక్కవాసన. కొవ్వు కాలుతున్న దుర్గంధం.

"దుర్మార్గులు. మనిషిని అవమానిస్తారూ, తననో వాజమ్మలాగ చూసి, యిప్పుడేమో దోస్తీ కావాలంటారూ!"

"ఇక్కడ వుండలేను. మరో గదుందేమో చూడవోయ్, లూకా."

"వరండా వుందండి. కాని బాగా చలిగా వుంది గదండీ."

"అవును. ఎముకలు కొరికే చలి. ఇలా వుంటుందని తెలిస్తే పేకముక్కలూ, కాసింత మందూ తెచ్చేవాణ్ణి. ఏయ్, కుంపట్లో మంట కాస్త పెంచు." అంటూ ఒళ్లు విరిచాడు ప్లెయింటిఫ్.

"నీళ్లు మసలబెట్టు. నా దగ్గిర కాసింత టీ వుంది. శక్కర కావాలి." అన్నాడు పబ్లిక్ ప్రాసిక్యూటర్.

"శక్కరా, బలే ఆలోచనే, ఈ అడవిలో శక్కరెక్కడ దొరుకుతుంది?"

మూడు కప్పుల్లో టీ పోశాడు ప్లెయింటిఫ్.

"నాకు టీ యిచ్చే దొంగ వేషాలెందుకు? మొదట మొహంమీద ఉమ్మేస్తారు. తరువాత ముద్దు పెట్టుకుంటామంటారు. మొదట నువ్వెంత అంటారు. తరువాత నీ అంతవాడు లేడంటారు."

అక్కడ కూర్చోవడమే వెగటుగా వుంది. జేబులో కాసిని శక్కర బిళ్లలున్నట్లుగా సడెన్‌గా జ్ఞాపకం వచ్చి-

"నే నీటీ తాగను." అన్నాడు ప్యాట్యోర్కిన్.

"పోనీ, వేణ్ణీళ్లే తాగు. నీ యిష్టం."

"ఎందుకింత పంతం? మా దగ్గిర టీ వుంది. నీ దగ్గిర శక్కరుంది. అందరం ఎంజాయ్ చేద్దాం. అలా సిగ్గుపడి మెలికలు తిరిగిపోతావేమోయ్ ఆడపిల్లలాగా. అంత యిష్టం లేకపోతే మా టీ తాగకుగాని. ఆ శక్కరైతే యివ్వు మొదట."

"ఈనాడు కోర్టులో జరిగిన అవమానం నేను జన్మలో మరచిపోగలనా!" అనుకుంటూ దిండు వేసుకొని కింద పడుకొన్నాడు ప్యాట్యోర్కిన్.

"మన్నుదిన్న పాములాగా ఈ పడకేమిటీ. నాకు ఓ లా పాయింట్ చెప్పు. మన లూకా గాడు హోటల్లో దిట్టంగా మెక్కి బిల్లివ్వలేదనుకో. అది దొంగతనమా? మోసమా?" అంటూ ప్లెయింటిఫ్ ప్రాసిక్యూటర్ను గిల్లాడు.

"ఏదీ కాదు. మహా అయితే ఓ చిన్న సివిల్ కేసు వెయ్యచ్చు."

అలాగా, ఆ ఆర్గ్యుమెంటు మరో రెండు

"చూశావా, గాఢనిద్రలో వున్నాడోయ్. ఇంత ఛండాలమైన చోట కూడా యిలా నిద్రపోగలగటం గొప్పే. లాయర్లంటే సంపన్నులనుకుంటారు. నా బతుకు చూడు. కుక్కకన్నా అధ్వానం... ఈ కుర్రవాడు, పేరేమిటో మరచిపోయాను గాని, కోర్టులో బలే అదరగొట్టాడోయ్."

గంటలు నడిచింది. కళ్లు మూసుకున్నాడే గాని, ప్యాట్యోర్కిన్ కోపంతో వూగిపోతున్నాడు. "లా చదువుకొని మూర్ఖులు యిలాగే మాట్లాడుకుంటారు."

మరి కాసేపటికి, ప్రాసిక్యూటర్ కూడా ఆవలిస్తూ...

"ఇంక నీ వాదన ఆపవోయ్, మన యువ లాయరుగారికి నిద్రా భంగమవుతున్నది" అన్నాడు.

"ఈసారు యింకా పడుకోలేదా?"

ప్యాట్యోర్కిన్ ఊపిరి బిగపట్టి మరీ పడుకున్నాడు.

"చూశావా, గాఢనిద్రలో వున్నాడోయ్. ఇంత ఛండాలమైన చోట కూడా యిలా నిద్రపోగలగటం గొప్పే. లాయర్లంటే సంపన్నులనుకుంటారు. నా బతుకు చూడు. కుక్కకన్నా అధ్వానం... ఈ కుర్రవాడు, పేరేమిటో మరచిపోయాను గాని, కోర్టులో బలే అదరగొట్టాడోయ్."

"సందేహం లేదు. చాకులాంటి కుర్రాడు. లా క్షుణ్ణంగా చదువుకున్నవాడిలా వున్నాడు. మొదటి రోజునే ఏమిటా వాదనా పటిమ! కాకపోతే అలా ఆముదం తాగిన మొహం పెట్టక్కర్లేదు."

"వీళ్లవని చెబుతాను."

"కాస్త శక్కర యివ్వటానికి అలా ఏడుస్తాడేమిటి? మనల్ని చూసి అంత చిర్రెత్తి పోతాడెందుకూ? ఏం చేశామని?"

కోపం పట్టలేని ప్యాట్యోర్కిన్ వాళ్లను ఎడాపెడా దులిపెయ్యాలని ఒక్క ఉదుటున లేచి కూర్చున్నాడు. కాని శరీరం వశం తప్పింది. తిట్లకు బదులుగా కన్నీళ్లుబికి వచ్చాయి.

"ఎందుకు బాబూ అంత దుఃఖం? ఏమైంది?" అంటూ అనునయించాడు ప్రాసిక్యూటర్.

"జ్వరం వచ్చిందా? జబ్బు చేసిందా? డబ్బు కావాలా?" అంటూ భుజం మీద చెయ్యేశాడు ప్లెయింటిఫ్.

"నీచం. నీచం. మిమ్మల్ని నమ్మటానికి లేదు. అన్నీ అబద్ధాలు."

"ఎంతకంత బాధపడుతున్నావు బాబూ. ఎవరి మీద ఆ కోపం? కోర్టులో అంత అద్భుతంగా వాదించిన కుర్రాడికి యింత బేలతనమా? ఇదే నీ మొదటి కేసు కదూ! అయితే నువ్విలా వుండటంలో ఆశ్చర్యం లేదు. కోర్టులో నా మొదటిరోజున ఏమనిపించిందో తెలుసా! ఉరేసుకొని చావాలన్నంత విరక్తి కలిగింది. ఏడుస్తావా. ఏడువు. కాసింత కన్నీరు కారిపోనీ."

"ఐ హేటిట్."

"అలాగే వుంటుందిలే. నీ వాదన బలంగానే వుంది. అన్ని పాయింట్లూ కవర్ చేశావు. జడ్జీలు కూడా నీవన్నీ జాగ్రత్తగా విన్నారు. నా మొదటిరోజు ఎలా వుందో తెలుసా? బుడబుక్కలవాడు రాజప్రసాదంలోకి వెళ్లినట్టుగా వుంది. బంట్రోత్తుతో సహా, కోర్టులో వున్న వాళ్లంతా నన్ను చూసి నవ్వినట్టుగా అనిపించింది. మొదటిసారి అందరికీ ఆ మాత్రం బెదురుంటుంది నాయనా." కాని, మీరంతా నిజంగా నన్ను చూసి నవ్వలేదూ! నన్నవమానించలేదూ!"

"లేదు. అంతా నీ వూహ. లే, ఈ టీ తాగి పడుకో."

ప్యాట్యోర్కిన్ "బద్ధ శత్రువులు" అతడి కన్నీరు తుడిచి, బుజ్జగించి, చలికి వణికిపోకుండా వున్ని దుస్తులు కప్పి పసిపిల్లవాణ్ణి చేసి లాలించారు. క్రితంరోజు జరిగిన చేదు అనుభవం తన వూహే తప్ప నిజం కాదని తెలిసి ప్యాట్యోర్కిన్ సుఖ నిద్రలోకి జారుకున్నాడు.

■